106

# దేవుడి నవ్వు

భూమ్మీద పెరిగిపోతున్న పాపానికి దేవుడు విపరీతంగా ఏడుస్తున్నట్టు వర్షం కుండపోతగా కురుస్తోంది. చచ్చిపోతానని తెలిసిపోయిన పేషంటు కళ్లు తెరిచినప్పుడు ఎదురుగా కనిపించిన బంధువుల్నీ, డాక్టర్నీ, వాళ్లందరి కళ్ళలోని ఆప్యాయతనీ చూసినప్పుడు కలిగే ఆశల్లాగ వుండుండి మెరుపులు, వాటివెనకనే ఆశాభంగ మంత శబ్దంతో వురుములూ.... నిర్మలంగా వున్నప్పుడు అందమైన అమ్మాయి మొహంలోని ప్రశాంతం లాటి ఆకాశానికి, జీవితంలో అన్నివిధాలా వోడిపోయి ప్రపంచం మీద చెప్పలేనంత కసిపుట్టి, జుత్తువిరగ బోసుకుని "ఈ ప్రపంచంమీద పగ తీర్చు కుంటా"నని శపథం పట్టిన భయంకరమైన ఆడదాని కోపంలాంటి రూపాన్నిస్తున్నాయి.అప్పుడాకాశమెలాగుందంటే, దేశంలోఅన్యాయంలాగ అందంగా భయంకరంగా వుంది. ఇంకా మనసులో చీటికలా విశాలంగా నల్లగా కూడా వుంది.

అప్పుడు.... హాస్పిటల్ స్పెషల్ వార్డులో తెల్లని బెడ్డుమీద ఓ తెల్లని అబ్బాయి నిద్రపోతున్నాడు. అతనికి పదమూడేళ్ళ వయసుంటుంది. మనసులో ప్రశాంతత నిండి ఉంటుంది. వాటితోబాటు నిద్రపట్టడానికి డాక్టరిచ్చిన మందూ, పక్కనే కొండంత నాన్న వున్నాడన్న ధైర్యం కూడా వుండుంటాయి.

అతని తలపక్కనే కూర్చొన్న వ్యక్తికి నలభైయ్యేళ్ల వయసూ, మనసులో బైట వర్షంలాంటి ఆలోచనలూ వున్నాయి. మనిషి కొండంత

లేదు. అడ్డుగా వున్న కొండని ప్రభుత్వం వాళ్ళు డైనమేట్లు వేసిపేల్చే సినప్పుడు ఎగిరిపోయిన రాయిముక్కలా దీనంగా వున్నాడు. అతని కుడి చెయ్యి కుర్రాడి జుత్తుమీద, కాల్తున్న సిగరెట్టు ఎడంచేతిలోనూ వున్నాయి. అతని కళ్ళెర్రగానూ చూపులు దీనంగాను వున్నాయి. ఓ మారతన్ని చూస్తే, బహుశా అవెప్పుడూ అలానే వుంటాయనిపిస్తుంది.

అలా నాలుగు రోజుల్నించీ అతనాకుర్రాణ్ణి కనిపెట్టుకునే వుంటు న్నాడు. ఐదురోజుల క్రితం 'బాబు' బాగానే వున్నాడు. క్లాసులో తనకి ఫస్టుమార్కులొచ్చిన పేపర్లని చూపించి, అందంగా గర్వంగా నవ్వాడు కాని ఆవేళ రాత్రి బాబు భోం చేయనన్నాడు. వళ్ళు చూస్తే కాల్తోంది. ఇంట్లో వంట మనిషి తప్పెవ్వరూలేరు. అప్పటిదాకా ప్రశాంతంగావున్న ఇంట్లో అశాంతి దుమారంలా రేగింది....వాడికి ఏడేళ్ళ వయసప్పుడు కావోసు, తలనొప్పొచ్చింది. అంతకుముందు కూడా రెండు మూడు సార్లు వచ్చింది. వచ్చి తగ్గిపోయింది. అప్పుడు తనకి గుండెల్నెవరో చీల్చేసి నట్టనిపించింది. అప్పుడు బాధగా పెట్టిన బాబు ముఖం, నల్లని వాడికళ్ళ వెనక ఇంకా నల్లని చీకటి దాగుందనిపించే ఆలోచనా....ఇవన్నీ కళ్ళ ముందు కదిలాయి. ఆఫీసు సెలవుపెట్టి ఆశా, గౌరవం వెదజల్లి, ఐసెష్ప లిస్టు దగ్గరికి తీస్కెళ్ళాడు.

నిజానికంత గాభారా పడవల్సిందేమీ లేదు. కాని....కాని.... అదంతే।

ఆ తర్వాత వాడికెప్పుడూ తలనొప్పి మరేనొప్పీ, రాలేదు. ప్రిన్సాఫ్ వేల్స్‌లా పెరిగేడు. అందంగా నవ్వేడు. ఆనందంగా తిరిగేడు. శ్రద్ధగా చదివేడు. తన కళ్ళలో ఆశల్ని, వాడి కదలికలు కళ్ళలో కాంతి, ముద్దుపెట్టుకునేవి. కాని నాల్రోజుల క్రితం....

బాబుకి జ్వరం వచ్చింది.......

దేవుడు మొన్ననే అవతరామెత్తి నిన్ననే చచ్చిపోయాడు. ప్రపంచంలో శాంతీ, దేశంలో సౌఖ్యం సముద్రంలా పొంగుతాయి.

ఇలాగ నమ్మలేని విషయాలు జరిగినట్లైంది.

"బాబుకి జ్వరమేమిటి! దేముడికి బాధలాగ" అనిపించింది. బాబుకి వేగం జ్వరం తగ్గిపోతే ఎంతోమంది దేవుళ్ళకి ఎన్నో ఇస్తానని మొక్కుకున్నాడు తను.

మరేమీ ఆలోచించకుండా, అప్పటికప్పుడు 'బాబు' ని స్పెషల్ వార్డులో చేర్పించాడు. నాలుగు రోజుల్నుంచీ కళ్ళలో ఆశనీ, ఆత్రుతనీ వెలిగించుకొని బాబు పక్కనే వుంటున్నాడు.

"మిస్టర్ శంకరం." బైటనించి అసిస్టెంటు కాబోలు పిలుస్తున్నాడు. అలా పిలవడం రెండోమారో, మూడవమారోననీ, శంకరం అంటే తనేనని అతనికి జ్ఞాపకమొచ్చింది.

వెంటనేలేచి 'కమిన్ ప్లీజ్' అన్నాడు.

స్వింగ్ డోర్స్ తెరుచుకుని అసిస్టెంటూ నర్సూ లోపలికొచ్చారు.

"నిద్రపట్టేసిందా?" అనడిగా డసిస్టెంటు.

"ఊఁ"

"మీరు భోంచేశారా?"

"ఇంకా లేదు."

"చూడండీ! మీరే ఇలా ఐపోతేలా? ఈటీజ్ నాటెటాలే సీరియస్ కేస్. ధైర్యంగా వుండాలి!" అని చిర్నవ్వు నవ్వుతూ శంకరం భుజం మీద చెయ్యి వేస్తూ అన్నాడు అసిస్టెంట్.

"బాబుకి నయమౌతుందంటారా?"

"ష్యూర్!" అని వరమిచ్చిన దేవుళ్ళా నవ్వాడతను.

అప్పుడు శంకరం సంతృప్తిగా నవ్వాడు. ఆ నవ్వు, ఎన్నాళ్ళనించో చీకటిగావున్న గదిలో టార్చిలైటు వేసినట్టుంది.

"వెళ్తాం! భోజనం మానేసి హెల్తు పాడు చేశోకకండి. బి బ్రేవ్. గుడ్‌నైట్...."

"గుడ్‌నైట్"

అసిస్టెంట్ బూట్ల చప్పుడు, నిశ్శబ్దంగా శబ్దాన్ని చేస్తున్న నర్సు కెట్సు చప్పుడూ, వాటితోబాటు శంకరం ముఖం మీది చిర్నవ్వు వెళ్ళిపోయాయి.

సిగరెట్టు పారేసి మళ్ళీ కూర్చున్నాడు శంకరం.

బాబు పక్కకి ఒత్తిగిలేడు. వాడిముఖం స్పష్టంగా కనిపిస్తోంది. వాడి ముఖంలో సరోజ కనిపిస్తుంది....ఇప్పుడూ కనిపిస్తోంది. వాడుకళ్ళు తెరచినప్పుడు నల్లని విశాలమైన కాటుక కళ్లూ, మూసుకొని, వున్నప్పుడు సంతృప్తి, విశాలమైన నుదురూ, బాణంలా ఒంగిన కనుబొమ్మలూ, చిన్న నోరూ, ఆ ఒంటిరంగూ....అన్నీ సరోజవే.

బాబును చూసినప్పుడెల్లా సరోజే గుర్తుకొస్తుంది.

చూడకపోయినా వస్తూనే వుంటుంది. పదిహేనేళ్ళక్రితం....తనకేం తక్కువ? బోలెడ్డబ్బూ, ప్రేమించి పెళ్ళి చేసుకొన్న సరోజ, అందమైన ఇల్లూ, ప్రాణంలాగ చూసుకొనే అమ్మా నాన్నా....

అదంతా అందనమైకల. అప్పుడు జీవితం అంతా గులాబిరేకులే పరుచుకున్నట్టుండేది. కాని ఓ ఏడాదిలోనే మొదటి ముల్లు గుచ్చుకొంది. అమ్మ చచ్చిపోయింది. ఆ తర్వాత మరో మూణ్ణెల్లకే రెండో ముల్లుని నిర్దాక్షిణ్యంగా గుండెల్లో గుచ్చి, నాన్న వెళ్ళిపోయాడు.

అప్పుడు వర్షాకాలపు మబ్బులా ఏడ్చిన తనని సరోజ పండిన పంటలా ఓదార్చింది. జీవితంలోని వేదాంతమంతా నవ్వుతూ చెప్పి, ఏడ్పూ మాన్పించింది బియ్యే 'హిస్టరీస్' ఫస్ట్‌క్లాసులో పాసైన సరోజ. అప్పుడు అందరు దేవుళ్లూ, అమ్మా, నాన్నా, ఆశా, ఆప్యాయతా, మెరుస్తున్న భవిష్యత్తూ, వీరందరూ, ఇవన్నీ సరోజలోనే కనిపించినట్లయింది.

త్వరలోనే మరో విషయం కూడా తెలిసింది. సరోజ తనకో వరాన్ని ప్రసాదించబోతోందని.

నిర్మలంగా పారుతున్న సెలయేట్లోని కలువపూవుల్లాగ కళ్ళు సగంవాల్చి "అబ్బాయా? అమ్మాయా?" అంది.

"నీ ఇష్టం" అన్నాడు తను ఆమె పెదవులమీద చూపుడువేల్తో రాస్తూ.

"ఉహు, మీ ఇష్టమే!" అంది సరోజ.

ఇద్దరిష్టా యిష్టాలు తేల్చుకోక ముందే 'బాబు' పుట్టేశాడు. అప్పుడు తను, అమ్మా నాన్నా మళ్ళీ బతికినట్టు సంతోషించాడు. కాని,

అంత వెలుగు వెనక భయంకరమైన చీకటి వుంటుందనీ, అస్వర్గంలాటి అనుభవం మాటున స్మశానం లాంటి పర్యవసానం పొంచివుందనీ అనుకోలేదు.

బాబు పుట్టిన రెండో రోజుకే సరోజ సుఖాల్ని, హృదయాల్ని తనతో తీస్కొని వెళ్ళిపోయింది, జ్ఞాపకమొచ్చినపుడెల్లా బాధించే మధుర మైన అనుభవాల్ని, కాసిన్ని ఫోటోల్ని, బోలెడంత బాధ్యతనీ, తనకోసం వదిలేసింది. ఈస్ట్మన్ కలర్ హిందీ చిత్రం ఎండింగంత బావుంటుం దనుకున్న జీవితం, సినిమా మధ్యలో హీరో విరహ గీతం పాడుతున్న ప్పుడు కరెంటు పోయిన నట్లయింది.

బాబు కోసమే తను బతికేడు. సరోజ నీడని వాళ్ళో చూస్తూ, ఆ చురుకైన కళ్ళ కోసం మెరుపులాటి నవ్వుకోసం, వాడి అందమైన భవిష్యత్తు కోసమే బతుకుతున్నాడు.

బాబుకి జ్వరం వస్తే-వాడివళ్ళు కాల్తూంటే చచ్చిపోయిన సరోజ బతికి మళ్ళీ చచ్చిపోయినట్టుంది.

"వాడికి జ్వరం తగ్గిపోయి తనకొచ్చినా బావుణ్ణు."

ఇలా ఆలోచిస్తున్న శంకరానికి అకస్మాత్తుగా దేవుడు జ్ఞాపక మొచ్చేడు.

బాబు బెడ్డెదురుగా గోడమీద వున్న కాలెండరులో దేవుడు ఓ చేత్తో ఆశీర్వదిస్తూ నవ్వుతున్నాడు.

బాబుకి దేవుడంటే చాలా భక్తి. రోజూ పొద్దున్నే స్నానం చేయ గానే దేవుడికి దణ్ణం పెట్టందే కాఫీ ఐనా తాగడు....

దేవుడు చల్లగా చూస్తే....

"నాన్నా!"

"అరే! లేచావా బాబు?"

"ఊఁ! ఆకలేస్తోంది."

టైము చూశాడు శంకరం. పన్నెండైంది.

వెన్న రాసిన రొట్టె తిన్నాక మళ్ళీ నిద్రపోయాడు బాబు. ఓసారి నర్సొచ్చి చెయ్యి చూసి వెళ్ళిపోయింది.

బైట వర్షం అప్పుడే తగ్గుతుంది. ఫ్లాస్కులో వున్న కాఫీ తాగి సిగరెట్టు ముట్టించి లైటార్పేసి బైటికొచ్చాడు శంకరం.

వర్షం విసుగొచ్చి కురవడం మానేసింది.

పైన ఆకాశం, వార్డుపైని మొజైక్ ఫ్లోరింగూ నిర్మలంగా మెరుస్తున్నాయి.

అన్ని వార్డులవాళ్లూ నిద్రపోయినట్టున్నారు.

భయంకరంగా వున్న నిశ్శబ్దం చావుని కక్కడానికి సిద్ధంగా వున్నట్టుంది.

రెండు వార్డుల కవతల బెంచీ, దానిమీద ఒక వ్యక్తి వున్నారు. శంకరం ఆ బెంచీ దగ్గరకెళ్ళాడు. ఆ వ్యక్తి శంకరాన్ని గమనించ లేదు.

ఆ వ్యక్తిని చూస్తే, ప్రపంచంలో వున్న నిరాశనంతటినీ చూసినట్టుంది. అతని కళ్ళు శూన్యంలోకి, మనసు చావులోకీ చూస్తున్నట్టున్నాయి. భూమ్మీద దురదృష్టమంతటికీ ప్రతినిధిలా వున్నాడతను.

అతనికాస్త దూరంగానే శంకరం కూర్చొన్నాడు. అప్పుడే ఆకాశంలో కొచ్చిన చంద్రుడు నిద్రపోతున్న నగరాన్ని ఆసక్తితో చూస్తూ జోరుగా వెళ్ళిపోతున్నాడు.

గాలి జోరుగాను, వుండుండి మెల్లగానూ వీస్తోంది. మరి కాస్సేపు ఆలోచనల్తో కుస్తీపట్టిన శంకరం మెదడు కాస్త విశ్రాంతిని కోరింది.

మొదట్లో మగతగా కనిపించిన తెల్లగౌనులూ, మెరుస్తున్న ఫ్లోరింగూ క్రమేపీ కనపడ్డం మానేశాయి.

* * *

ఒక్కసారి ఏకో పీడకల మెరుపులాగ మెరిసింది.

శంకరం ఒక్కసారిగా కళ్ళుతెరిచాడు. పక్కనే ఇందాకటి వ్యక్తి తల గోడకానించి నిద్రపోతున్నాడు. నేలా, గౌన్లూ, ఆకాశం అన్నీ మామూలుగానే మెరుస్తున్నాయి.

రెండడుగుల దూరంలోనే ఇద్దరసిస్టెంట్లు సిగరెట్లు కాల్చుకుంటూ సినిమాల గురించి మాట్లాడుకుంటున్నారు.

శంకరం మళ్ళీ కళ్ళు మూసుక్కున్నాడు
వాళ్ళమాటలింకా వినబడుతూనే వున్నాయి.
ఓ పది నిముషాలు గాల్లో కలిసిపోయాయి....
"ఎంత పీస్‌ఫుల్‌గా నిద్రపోతున్నాడో చూశారా,"
శంకరం వులిక్కిపడ్డాడు. కళ్ళు మాత్రం విప్పలేదు.

"బట్ హీ ఈజ్ వెరీ అన్‌ఫార్ట్యునేట్ ఫాదర్. ఆ కుర్రాడికి పదిహేనేళ్ళైనా వుండవ్. సడన్‌గా సెరిబ్రల్ న్యుమోనియా వచ్చింది. మోస్టనెక్స్‌పెక్టెడ్."

శంకరం హృదయాన్నెవరో చీలుస్తున్నారు.

"ఎవరి సంగతి మీరు చెప్తున్నది?" ఆ రెండో ఆయన అడిగాడు.

"అదే! ఆ మార్వాడీ పక్కవార్డు. ఆచారిగారు ట్రీట్ చేస్తున్నారు. ఈయనకింకా తెలియదుపాపం",

శంకరం హృదయం బద్దలైంది. బద్దలైన హృదయంలో మెగాటన్నులు పేల్తున్నాయి. బద్దలైన మెగాటన్నులు మెదణ్ని పేలుస్తున్నాయి.

సందేహంలేదు. ఆ మార్వాడీ తన పక్క వార్డులోనే వుంటున్నాడు. నాలుగు నెలలనించీ కాబోలు.......! మార్వాడీ పక్కవార్డులో కుర్రాడు.... సెరిబ్రల్ న్యుమోనియా.... గుడ్‌నెస్.... సరోజకూ్కడా చచ్చిపోయేముందే వచ్చింది.

మెదళ్ళో లెక్కలేనన్ని మిషన్‌గన్‌లు ఆగకుండా పేల్తున్నాయి.
ఒళ్ళు స్వాధీనం తప్పుతోంది.
సెరిబ్రల్ న్యుమోనియా వస్తే బతకడం దుర్లభం.
బాబు బతక్కపోతే.... బాబు చచ్చిపోవడమా?
పొద్దున్న అసిస్టెంటెందుకలా చెప్పాడు?

మనుషులూ, నమ్మినవాళ్లూ, దేవుడూ.... ఎందుకు వీళ్ళందరూ తన్ని దగా చేస్తున్నారు?

మెదడు ఆలోచించడం మానేస్తోంది. ఆలోచనల సంకెళ్ళు తెంపుకొని ఎక్కడికో పురికేస్తోంది.

బాబు చావు తను చూళ్లేడు. ఆ నల్లని చురుకైన కళ్ళు నిశ్చింతగా మూసుకుపోతే, ఆ నవ్వే చిన్న ఎర్రని పెదవులు పూర్తిగా నవ్వడం మానేసి నిశ్చలంగావుండిపోతే.... తనెలా బతకడం?

మిగిలిన ఒక్క ఆశాకిరణం ఆరిపోతే ఎలాగ?

మైగాడ్.... బాబు చచ్చిపోవడానికి బదులు ఈ ప్రపంచం కాలిపో కూడదూ? సముద్రం పొంగి అందర్నీ ముంచేయకూడదూ.?

హే భగవంతుడా! నువ్వున్నావా? చచ్చిపోయావా? నీ ఆశీర్వదించే అభయహస్తం.... నీ నవ్వు ఇవన్నీ........

ఒళ్ళంతా చమట్లు.

ఏవాలోచించాలో తెలీని మెదడు ఒక నిశ్చయాని కొచ్చింది.

బాబు చావు తను చూళ్ళేడు.

దానికి బదులు తను దూరంగా వెళ్ళిపోతే మంచిది.

శంకరం లేచి గబ గబ మెట్లుదిగి హాస్పిటల్ కాంపౌండు దాటి రోడ్డుమీద కొచ్చేశాడు.

బాబుకి సెరిబ్రల్ న్యుమోనియా! అబ్బ.... చావు తనకెందుకు రాకూడదు?

బాబు శవం.... మంటలు.... అమ్మనీ, నాన్ననీ, సరోజనీ వీళ్ళం దర్నీ కాల్చేసిన మంటలు........

తన చేత్తో అవే మంటల్లోకి బాబునీ....

అబ్బా.... హారిబుల్... ఏవిటది.... ఏదో........

ప్రపంచంలోవున్న అగ్నిపర్వతాలన్నీ ఒకేమారు పగిలినట్టుంది....

అప్పుడే లారీని కర్రల్తో లోడ్‌చేసి, కడుపుని సారాతో లోడ్ చేసొక్కని స్పీడుగా లారీ తోల్తున్న డ్రైవర్ చూపుకి శంకరం ఆనలేదు. ఆనినా లారీ శంకరం మీదుగా పరిగెత్తడం మానలేదు.

శంకరం కంటిముందు ఒక్కసారి ఎన్నో మంటలు మండి మళ్ళీ ఆరిపోయాయి.

ఆరిపోయే ముందు అమ్మా, నాన్నా, సరోజ, బాబు, తనూ, కాలెండర్లో నవ్వుతున్న దేవుడూ అందరూ వాట్లో కనిపించారు.

* * *

తెల్లవారిం తర్వాత ఆకాశం చీర, మార్చుకున్నట్టు అందంగా వుంది. పక్షులు గుంపులుగా అరుస్తూ వెళ్ళిపోతున్నాయి.

ఏడో నెంబరు వార్డులో 'బాబు' నోట్లోంచప్పుడే తీసిన థర్మామీటరు చూసి సంతృప్తిగా నిట్టూర్చి "సబ్ నార్మల్" అంది నర్సు. బాబు కళ్లూ, మొహం మెరుస్తున్నాయి. "సిస్టర్! మా నాన్నగారేరీ?" అనడిగాడు బాబు.

"అలా బైటికి వెళ్ళారేమో వచ్చేస్తారు" అని అతని నుదుటి నోమారు నిమిరి వెళ్ళిపోబోయింది నర్సు.

"సిస్టర్! బైట ఎవ రేడుస్తున్నారు?" అనడిగాడు బాబు.

"తొమ్మిదో నెంబరు వార్డులో కుర్రాడు పోయాడు పాపం! నీ అంతే వుంటాడు. సరే! నువ్వుమాత్రం పడుక్కో, మీ నాన్నగారు పైనుంటే పంపిస్తాను! బహుశ రేపే డిశ్చార్జ్ చేసేస్తాం. ఏం?" అని మృదువుగా అతని కళ్ళని ముద్దుపెట్టుకొని వెళ్ళిపోయింది నర్సు.

రేపు డిశ్చార్జ్ చేసేస్తారంటే 'బాబు' వారం తర్వాత స్కూల్లో జరుగబోయే స్పోర్ట్సులో ఏన్నింగు రేసులో ఫస్టుప్రైజ్ వచ్చినట్టుంది. కాని 'బాబు'కి దాదాపు తనంత కుర్రాడే చచ్చిపోయాడంటే అదోలావుంది. రన్నింగ్‌రేసులో కప్పు గెల్చింతర్వాత కాలువిరిగిపోయినట్టుంది. ఎందుకో బైటకెళ్ళి చూడాలనిపించింది.

ఓపిక తెచ్చుకొని బైటకొచ్చాడు బాబు.

పక్కవార్డు మార్వాడీ, ఇంకా కొందరు డాక్టర్లు, నర్సులు, మనుషులు మార్వాడీ ఎడం పక్క వార్డు దగ్గర నిలబడివున్నారు వాళ్ళందరి మొఖాల్లోను విచారంవుంది. వాళ్ళందరి కళ్ళలోనూ గూడుకట్టుకున్న జాలి, పరిపూర్తిగా విప్పని కన్నీళ్లూ వున్నాయి.

తొమ్మిదోనంబరు వార్డులోంచి కాసేపట్లో స్ట్రెచర్ మీద దాదాపు పదిహేనేళ్ళ కుర్రాడి శవాన్ని తీస్కొచ్చేశారు.

ఒక డాక్టరు తలమీదికి పూర్తిగా తెల్లబట్టను కప్పేశాడు. నిరాశలాటి వ్యక్తి, వాళ్ళ నాన్నకాబోలు, ఏడవకుండానే చేతులు కట్టుకొని ఏ భావానికీ ఏ భాషకీ అందని ధైర్యాన్నీ, విచారాన్నీ కళ్ళల్లో నింపుకొని

స్ట్రెచర్ వెనుకగా నడుస్తూ వెళ్ళిపోయాడు. అప్పు డతని గుండెల్లో మంటలు ఆశల్నీ, ఆలోచనల్నీ పూర్తిగా మసి చేసినట్టున్నాయి.

"ఏమయింది?" ఎవరో అడుగుతున్నారు.

"సెర్బ్రిబల్ న్యుమోనియా! హఠాత్తుగా వచ్చి రాత్రికి రాత్రే కొట్టేసింది. పాపం పదిహేనైనా వుండవ్!" ఎవరో చెప్తున్నారు.

బాబు లోపలికొచ్చేశాడు. అతని మనసంతా కెలికేసినట్టుంది. జ్వరం తగ్గిపోయి తేలికగావున్న మనస్సు మళ్ళీ బరువెక్కినట్టుంది. ఎలావుందంటే - తెల్లని గ్లాసులో, ఇంకా తెల్లని, చల్లని ఐస్ వాటర్లో, నల్లని మసిబొగ్గు పడ్డట్టుంది. అప్పుడు బాబు దేవుడి కాలెండరు దగ్గరకు వెళ్ళి చేతులు జోడించాడు.

"భగవంతుడా! అంత చిన్న కుర్రాణ్ణెందుకు చంపేశావ్? ఎంత పనిచేశావు? ఎందుకిలా చేశావు".... అని కాస్సేపు బాధపడ్డాడు.

తర్వాత మళ్ళీ - "నాన్న ఇంటికొక్కని వెళ్ళారేమో! నా దగ్గరికి వేగమొచ్చేసేట్టు చెయ్యి. రేపు డిశ్చార్జయిపోతే నాన్నెంత సంతోషిస్తారు? ఎంత సంతృప్తిగా నవ్వుతారు! మళ్ళీ బడికెళ్తూ, చదువుకుంటూ, నాన్నతో కలసి సినిమాలకి వెళ్ళొచ్చు. అందుకని నాన్న వేగమిక్కడికి వచ్చేటట్టు చెయ్యి. డిశ్చార్జి చేసేస్తారని చెప్పాలి." అని మనస్ఫూర్తిగా ప్రార్థించాడు.

అలా ప్రార్థించిన తర్వాత బెడ్డు మీదకు వెళ్ళి కాలండరు వైపే చూస్తూ కూర్చున్నాడు బాబు.

కాలెండర్లో దేవుడు ఓ చేత్తో ఆశీర్వదిస్తూ, నిర్మలమైన నీరు కప్పేసిన సుడిగుండంలా అందంగా నవ్వుతున్నాడు.